టెన్షన్.. టెన్షన్

సిద్దిపేటలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఫైట్

- హరీశ్ రాజీనామా చేయాలంటూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలతో మొదలైన వివాదం
- అర్ధరాత్రి ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో కేసీఆర్, హరీశ్‌రావు ఫ్లెక్సీలను చింపిన హస్తం నాయకులు
- ఇరు పార్టీల పోటాపోటీ ర్యాలీలు
- కాంగ్రెస్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చింపిన బీఆర్ఎస్ నాయకులు
- బీఆర్ఎస్ నాయకులపై స్వల్ప లాఠీచార్జి
- ఇరు వర్గాల అరెస్టు.. కేసుల నమోదు

సిద్దిపేట పట్టణంలో మొదటిసారి ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య సాగిన గొడవతో పట్టణం అట్టుడికిపోయింది. దీంతో పట్టణంలోని పలు చౌరస్తాలు, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలు, క్యాంపు కార్యాలయాల వద్ద భారీగా పోలీసులు మోహరించారు. పోటాపోటీగా ఫ్లెక్సీలను చింపివేయడం, తోపులాటలు, నినాదాలు, వాగ్వాదాలతో పట్టణంలో అలజడి నెలకొన్నది.

- సిద్దిపేట టౌన్, ఆగస్టు 17

'రుణమాఫీ అయిపోయే.. నీ రాజీనామా ఏడబోయే' వంటి రాతలతో కూడిన హోర్డింగ్‌లను సిద్దిపేట పట్టణంలోని పలు చౌరస్తాల్లో కాంగ్రెస్ నాయకులు శుక్రవారం రాత్రి ఏర్పాటు చేయించారు. ఈ ఫ్లెక్సీ వివాదం బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ శ్రేణుల మధ్య చిలికిచిలికి గాలివానలా మారింది. అర్ధరాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు సిద్దిపేట హైటెన్షన్ నెలకొన్నది. శుక్రవారం అర్ధరాత్రి ఫ్లెక్సీ ఏర్పాటు విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు స్థానిక బీజేఆర్ చౌరస్తా వద్దకు చేరుకుని వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. వారిని పోలీసులు అరెస్ట్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న పలువురు కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే హరీశ్‌రావు క్యాంపు కార్యాలయం లోపలికి చొచ్చుకొని వెళ్లి కేసీఆర్, హరీశ్‌రావు ఫ్లెక్సీలను చింపివేశారు.


అర్ధరాత్రి క్యాంపు కార్యాలయంలో ఫ్లెక్సీ చింపుతున్న వ్యక్తి

ఇరు వర్గాల ర్యాలీలు

విషయాన్ని తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు, విద్యార్థి విభాగం, యువజన విభాగం నాయకులు, హరీశ్‌రావు అభిమానులు శనివారం ఉదయం క్యాంపు కార్యాలయానికి పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. క్యాంపు కార్యాలయం నుంచి స్థానిక అంబేడ్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి నాయకులు బీజేఆర్ చౌరస్తా వద్దకు చేరుకుని, ఎమ్మెల్యే హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తామంటూ అటు వైపు వెళ్తుండగా పోలీసులు అడ్డుకొని, వారిని అరెస్ట్ చేసి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.


క్యాంపు కార్యాలయం వైపు వెళ్లేందుకు యత్నిస్తున్న కాంగ్రెస్ నాయకులు

స్వల్ప లాఠీచార్జి

పట్టణంలోని బీజేఆర్ చౌరస్తా వద్ద శుక్రవారం రాత్రి కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని శనివారం ఉదయం బీఆర్ఎస్ నాయకులు పోలీసుల వలయాలను ఛేదించుకుని చింపివేశారు. ఈ క్రమంలో చౌరస్తా వద్ద హైదరాబాద్ రోడ్డు మార్గంలో డివైడర్ హోర్డింగ్‌పై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని చింపివేసి, కిందికి దిగుతున్న సమయంలో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. దీంతో పోలీసులకు, బీఆర్ఎస్ నాయకులకు మధ్య తోపులాట, వాగ్వాదం నెలకొన్నది. ఆ సమయంలో పోలీసులు పలువురు బీఆర్ఎస్ నాయకులపై లాఠీచార్జి చేశారు. అదుపులోకి తీసుకున్న నాయకులను వెంటనే విడిచిపెట్టాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేస్తూ, పోలీసు జులుం నశించాలంటూ నినదించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ముఖ్యమంత్రి ఫ్లెక్సీని దహనం చేశారు.

పరస్పర ఫిర్యాదులు.. కేసులు

కాంగ్రెస్ నాయకులు నలుగురు దౌర్జన్యంగా క్యాంపు కార్యాలయంలోకి చొరబడి ఫ్లెక్సీలను చింపివేశారని శనివారం ఎమ్మెల్యే పీఏ శేషుకుమార్ ఫిర్యాదుతో వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


బీఆర్ఎస్ నాయకులపై లాఠీచార్జి చేస్తున్న పోలీసులు

కరీంనగర్ రోడ్డులో ఓ కాంప్లెక్స్‌కు కట్టిన కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీని చింపడంతో ఇద్దరు బీఆర్ఎస్ నాయకులపై టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పట్టణంలో పలు చోట్ల ఫ్లెక్సీలను చింపుతూ, పోలీసుల విధులకు భంగం కలిగించారని బీఆర్ఎస్ నాయకులపై కేసులను నమోదు చేశారు. అనుమతి లేకుండా ర్యాలీలు చేపట్టినందుకు ఇరు పార్టీల నాయకులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ప్రజాశాంతికి భంగం కలిగించి, చట్టాన్ని చేతిలోకి తీసుకునే వారిని ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి తగు చర్యలు తీసుకుంటామని ఏసీపీ మధు హెచ్చరించారు. ఇరు పార్టీల కార్యకర్తలు, నాయకులు సంయమనం పాటించాలని సూచించారు. శనివారం పోలీసు అధికారులు వ్యవహరించిన తీరు పట్ల కలెక్టర్ కార్యాలయంలో ఏవో రహమాన్‌కు, సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధకు బీఆర్ఎస్ నాయకులు ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ మాట్లాడుతూ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటం పెట్టాలని శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తే పోలీసులు అడ్డుకోవడం తగదన్నారు. ఈ నెల 20న మైనంపల్లి హనుమంతరావు సిద్దిపేటకు రానున్నరని, పాత బస్టాండ్ వద్ద కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకున్న ఘటనల నేపథ్యంలో హరీశ్‌రావు సాయంత్రం నియోజకవర్గ కేంద్రానికి రాగా, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. 'మీ వెంటే మేమంటూ' కార్యకర్తలు ముక్తకంఠంతో చెప్పారు.


బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు




కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని చింపుతున్న బీఆర్ఎస్ శ్రేణుల, కాంగ్రెస్ అదుపులోకి తీసుకున్న పోలీసులు, బీఆర్ఎస్ ర్యాలీని అడ్డుకుంటున్న పోలీసులు


క్యాంపు కార్యాలయం వద్ద అభివాదం చేస్తున్న హరీశ్‌రావు

సిద్దిపేటను మసకబారిస్తున్నారు

- కాంగ్రెస్ ప్రభుత్వం అరాచకాలు సృష్టిస్తోంది
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, ఆగస్టు 17 : సిద్దిపేట కీర్తి ప్రతిష్ఠలకు భంగం వాటిల్లేలా ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. సిద్దిపేట అభివృద్ధిని మసకబారించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. పబ్లిక్ సర్వెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి సిద్దిపేట ఎన్‌జీవో భవన్‌లో ఎస్సెస్సీ టాపర్లతోపాటు ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హరీశ్‌రావు మాట్లాడారు. సిద్దిపేటలో రూ.150 కోట్లతో నిర్మిస్తున్న వెటర్నరీ కళాశాలను సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్‌కు తరలించారని ఆరోపించారు. 99శాతం పూర్తయిన వెయ్యి పడకల ఆస్పత్రి తుది పనులకు అడ్డుపడుతున్నారని ఆగ్రహించారు. కోమటిచెరువు అభివృద్ధి పనులకు సంబంధించిన నిధులను నిలిపివేశారని, ఓవైపు అభివృద్ధిని అడ్డుకుంటూనే మరోవైపు అరాచకశక్తులుగా మారుతూ చిచ్చుపెడుతున్నారని కన్నెర్రజేశారు. ఊపిరి ఉన్నంత వరకు సిద్దిపేట ప్రజలకు సేవ చేయడమే తప్ప ఇలాంటి కుట్రలు, కుతంత్రాలు తన వల్ల కాదన్నారు. తాజా పరిణామలను ప్రజలు గమనిస్తున్నారని హరీశ్‌రావు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫారూక్ హుస్సేన్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, అసోసియేషన్ అధ్యక్షుడు అంజయ్య, కార్యదర్శి విక్రమ్‌రెడ్డి, కోశాధికారి శ్రీనివాస్, అసోసియేషన్ జీవితకాల సభ్యులు, సీనియర్ సిటిజన్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రుణమాఫీ కాలేదని రోడ్డెక్కిన రైతులు

- రామునిపట్లలో రాజీవ్‌రహదారిపై బైఠాయింపు
- సీసీపల్లిలో సీఎం దిష్టిబొమ్మ దహనం

చిన్నకోడూరు/కోహెడ, ఆగస్టు 17 : రుణమాఫీ కాలేదని చిన్నకోడూరు, కోహెడ మండలాల్లో పలువురు రైతులు శనివారం రోడ్డెక్కారు. మూడో విడత రుణమాఫీ జాబితాలో తమ పేరు లేదని చిన్నకోడూరు మండలం రామునిపట్లలో రైతులు రాజీవ్‌రహదారిపై బైఠాయించి ధర్నా చేశారు. సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ధర్నాకు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కాముని శ్రీనివాస్, నాయకులు జంగిటి శ్రీనివాస్, కాముని ఉమేష్ చంద్ర, రమేష్ మద్దతు తెలిపారు. అరగంట పాటు ధర్నా నిర్వహించడంతో రోడ్డుపై వాహనాలు నిలిచిపోయాయి. సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, ఎస్ఐ అపూర్వరెడ్డి, చిన్నకోడూరు ఎస్ఐ బాలకృష్ణ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. వ్యవసాయశాఖ అధికారులు వచ్చే వరకు లేవబోమంటూ భీష్మించుకుని కూర్చున్నారు. చివరికి పోలీసులు వారిని బలవంతంగా లేపారు. పలువురు బీఆర్ఎస్ నాయకులను చిన్నకోడూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అంతకు ముందు రైతులు చిన్నకోడూరు అంబేడ్కర్ చౌరస్తాలో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. కోహెడ మండలంలోని చెంచల్‌చెరువుపల్లి(సీసీపల్లి) గ్రామంలో రైతులు బీఆర్ఎస్ నాయకుడు భీంరెడ్డి రాజిరెడ్డి ఆధ్వర్యంలో దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆవుల మహేందర్, వజ్జపల్లి శ్రీనివాస్, అన్నబోయిన భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.


సీసీపల్లిలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న రైతులు


రామునిపట్ల గ్రామంలో రాజీవ్‌రహదారిపై బైఠాయించి ధర్నా చేస్తున్న రైతులు, బీఆర్ఎస్ నాయకులు

ఇదేం నిబంధన!

ఏపీజీవీబీలో 70 ఏళ్ల పైబడిన రైతుల రుణాల రెన్యూవల్‌కు నిరాకరణ

చేర్యాల, ఆగస్టు 17 : కొమురవెల్లి మండల కేంద్రంలోని ఏపీజీవీబీ అధికారులు లేనిపోని కొర్రీలు పెడుతూ అన్నదాతలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇతర బ్యాంకుల్లో ఎక్కడాలేని విధంగా గ్రామీణ వికాస బ్యాంక్‌లో వయో నిబంధనల పేరిట పంట రుణాన్ని రెన్యూవల్ చేయడం లేదు. ఏపీజీవీబీలో ఇటీవల రూ.లక్ష పంట రుణ మాఫీ పొందిన రైతుల నుంచి ఏడాది కాలపరిమితితో కూడిన బలవంతపు డిపాజిట్లు చేయించడంతో పలువురు బ్యాంకు ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ విషయమై లీడ్‌బ్యాంక్, జిల్లా వ్యవసాయశాఖ అధికారులు బలవంతంగా డిపాజిట్లు చేసుకోకూడదని, రైతులకు త్వరితగతిన రెన్యూవల్ పూర్తి చేయాలని సూచించారు. కానీ బ్యాంకు సిబ్బందికి మాత్రం అవేమీ పట్టడం లేదు. కొమురవెల్లి ఏపీజీవీబీలో ఆర్‌బీఐ గైడ్‌లైన్స్ అని చెబుతూ రుణమాఫీ పొందిన రైతుల్లో 70 ఏళ్ల పైబడిన వారికి రుణాలను రెన్యూవల్ చేయడం లేదు. ఇదెక్కడి నిబంధన అంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలిసిన బీఆర్ఎస్ నాయకులు శనివారం బ్యాంక్ మేనేజర్ మల్లేశంను కలిసి విన్నవించగా 70 ఏళ్ల పైబడినవారికి లోన్లు ఇవ్వవద్దని ఆర్‌బీఐ గైడ్‌లైన్స్ ఉన్నాయని తెలిపారు. ఐదేళ్లుగా జరిపిన లావాదేవీలకు సంబంధించి బ్యాంకులో ఆడిట్ జరుగుతుందని, తాను ఐదు నెలల్లో రిటైర్‌మెంట్ అవుతున్నానని, ఇస్తే ప్రాబ్లమ్ అవుతుందని చెప్పారు. మండిపడిన నాయకులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

70 ఏళ్లు దాటితే లోన్ రాదన్నారు

నాకు రూ.33 వేలు పంట రుణం మాఫీ అయింది. రెన్యూవల్ చేయమని ఏపీజీవీబీ మేనేజర్‌ను అడిగాను. 70 ఏళ్లు దాటాయి కాబట్టి లోన్ రాదని చెప్పాడు. మా కుటుంబసభ్యుల పేరిట భూమిని మార్చుకుంటేనే ఇస్తాం లేకుంటే ఇవ్వమని చెప్పాడు. ఇంకెక్కడ ఇట్లాంటి అన్యాయం చేస్తలేరు. మాలాంటి పేదోళ్లను ఇబ్బందులు పెడుతున్న ఇలాంటి సార్లపై చర్యలు తీసుకోవాలి. మాకు లోన్ రెన్యూవల్ చేసి ఆదుకోవాలి.

- బుడిగె బాలమల్లు, రైతు గురువన్నపేట

జోరువాన

సిద్దిపేట జిల్లా రామారంలో అత్యధికంగా 8.1 సెం.మీ.

మెదక్ అర్బన్, ఆగస్టు 17 : ఉమ్మడి మెదక్ జిల్లాలో జోరు వర్షం కురిసింది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజాజీవనం అస్తవ్యస్తంగా మారింది. శనివారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతంగా కాగా.. మధాహ్నం నుంచి సాయంత్రం వరకు అక్కడక్కడా ఈదురుగాలులు, ఉరుములతో కూడిన భారీ వర్షం పడింది. దాంతో పలు చోట్ల రోడ్లు జలమయమయ్యాయి. ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా సిద్దిపేట జిల్లా రామారంలో 8.1 సెంటీమీటర్ల వర్షం కురిసింది. మునిగడపలో 6.4 సెం.మీ., అంగడికిష్టాపూర్ 4.8 సెం.మీ., రాంపూర్ 4.4 సెం.మీ., సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువు 5.4 సెం.మీ., కొండాపూర్ 5.3సెం.మీ., మెదక్ జిల్లా రామాయంపేట 4.9 సెం.మీ., మెదక్ 4.6 సెంటీమీటర్ల వర్షం పాతం నమోదైంది. మరో రెండు రోజులు వర్షలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

మర్మాములలో డెంగ్యూ కేసు

మద్దూరు, ఆగస్టు 17: లద్నూరులోని పీహెచ్‌సీ పరిధిలోని మర్మాముల గ్రామంలో డెంగ్యూ కేసు నమోదు కావడంతో ఆస్పత్రి సిబ్బంది అలర్ట్ అయ్యారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సుధీర్‌రాజ్ ఆధ్వర్యంలో సిబ్బంది గ్రామాన్ని సందర్శించి డెంగ్యూ బాధితుడి ఇంటికి వెళ్లి వివరాలు సేకరించారు. అనంతరం చుట్టుపక్కల ఇళ్లల్లోని వారి రక్తనమూనాలను సేకరించారు.

హత్యాచార నిందితులను ఉరితీయాలి

- సిద్దిపేటలో ఐఎంఏ ఆధ్వర్యంలో ప్రైవేట్ ఆస్పత్రుల బంద్

సిద్దిపేట టౌన్, ఆగస్టు 17 : కోల్‌కతాలోని ఆర్జీకార్ మెడికల్ కళాశాల జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం చేసిన నిందితులను వెంటనే ఉరితీయాలని సిద్దిపేట ఐఎంఏ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ భాస్కర్‌రావు డిమాండ్ చేశారు. ఐఎంఏ అసోసియేషన్ పిలుపు మేరకు శనివారం సిద్దిపేట పట్టణంలో ప్రైవేట్ ఆస్పత్రుల్లో 24 గంటల పాటు సేవలను బంద్ చేశారు. వైద్యులు, ఆయా ఆస్పత్రుల సిబ్బంది విధులను బహిష్కరించి ర్యాలీ నిర్వహించారు. రాస్తారోకో చేపట్టారు. దీంతో పలు వాహనాలు ఎక్కడిక్కడ నిలిచిపోవడంతో, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ సందర్భంగా డాక్టర్ భాస్కర్‌రావు మాట్లాడుతూ ప్రజలకు సేవలందిస్తున్న వైద్యులపై ఇలాంటి ఘటనలు జరగడం అత్యంత బాధకరమన్నారు. సభ్య సమాజం సిగ్గుపడేలా ఇలాంటి ఘటనకు పాల్పడ్డ నిందితులను కేంద్ర, బెంగాల్ ప్రభుత్వం ఉపేక్షించవద్దన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి : ఏబీవీపీ

సిద్దిపేట క్రైం, ఆగస్టు 17 : జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ సిద్దిపేట శాఖ ఆధ్వర్యంలో ముస్తాబాద్ చౌరస్తా నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ ఏపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ వివేక్ వర్థన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిందితులను వెంటనే కఠినంగా శిక్షించి బాధితురాలికి న్యాయం చేయకపోతే ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలను చేస్తామని హెచ్చరించారు.



మూసివేసిన ప్రైవేట్ ఆస్పత్రి


సిద్దిపేట పట్టణంలో ధర్నా చేస్తున్న వైద్యులు, సిబ్బంది

కొత్త పంచాయతీలకు
ఎన్నికలు జరిగేనా?

ఉమ్మడి జిల్లాలో 46 కొత్త జీపీలు
గెజిట్ విడుదలైనా.. ఎన్నికలపై స్పష్టత కరువు
తేలని వార్డుల విభజన, రిజర్వేషన్లు

మెదక్, ఆగస్టు 17: ఓవైపు గ్రామ పంచాయతీ ఎన్నికలకు కసరత్తు మొదలైన వేళ.. కొత్త పంచాయతీలకు ఎన్నికలు జరిగేనా అనే సందేహాలు తలెత్తుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో కొత్తగా 46 గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేస్తున్నట్టు ఇటీవల ప్రకటించిన ప్రభుత్వం.. తాజాగా అందుకు సంబంధించిన గెజిట్‌ను వెలువరించింది. ఇంతకు ముందు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 1,615 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. సిద్దిపేటలో 499, సంగారెడ్డిలో 647, మెదక్‌లో 469 జీపీలు ఉన్నాయి. కొత్తగా సిద్దిపేటలో 15, మెదక్‌లో 22, సంగారెడ్డిలో 9 పంచాయతీలు ఏర్పడ్డాయి. రెండు నెలల్లో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించనున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి ఇంతకుముందే ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొత్త పంచాయతీలకు అదే షెడ్యూల్‌లో ఎన్నికలు నిర్వహించడం సాధ్యమయ్యేనా అనే సందేహాలు తలెత్తుతున్నాయి.


పంచాయతీల కొత్త రూపు

కొత్తగా ఏర్పాటు చేసిన పంచాయతీలకు సంబంధించి వార్డుల విభజన చేయాల్సి ఉన్నది. పాత పంచాయతీ నుంచి ఓటర్లు, భౌగోళిక విభజనకు కసరత్తు జరుగుతున్నది. దీని ఆధారంగా వార్డుల విభజన చేయనున్నట్లు ఓ అధికారి తెలిపారు. త్వరలోనే పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో గతంలో కొనసాగిన పంచాయతీలో ఉన్న రిజర్వేషన్లనే అమలు చేయాలని స్థానిక నేతలు కోరుతున్నారు. కానీ, ఇందుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి మార్గదర్శకాలు రాలేదని అధికార వర్గాలు తెలిపారు. దీంతో, కొత్త పంచాయతీలకు మిగిలినవాటితో పాటు ఎన్నికలు నిర్వహించడంపై ఉత్కంఠ నెలకొన్నది.

ఇద్దరు పిల్లలతో సహా చెరువులో దూకి తల్లి ఆత్మహత్య 7లో

వరుణుడి కోసం 21 గ్రామాల్లోని ఆలయాల్లో పూజలు

కల్హేర్, ఆగస్టు 17: వానాకాలం ప్రారంభమై రెండునెలలు కావస్తున్నా.. వర్షాలు కురియకపోవడం, పంటలు వేయకపోవడంతో ఆందోళన చెందు తున్న రైతులు, ప్రజలు భారమంతా దేవుళ్లపై వేసి ఇక నీవే దిక్కు అంటూ ప్రత్యేక పూజలు, అభిషేకాలు, జలాధివాసాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన కల్హేర్‌కు చెందిన వందలాది మంది భక్తులు 11 గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో, మండల పరిధిలోని మార్డి గ్రామానికి చెందిన భక్తులు 21 గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్హేర్‌లోని బద్రప్ప శివాలయంలోని శివలింగం, నంది విగ్రహాలను నీటితో పూర్తిగా నింపి ప్రత్యేక పూజల అనంతరం తెప్పను వదిలిపెట్టారు. అనంతరం సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల్లోని 11 గ్రామాల్లో కల్హేర్, 21 గ్రామాల్లో మార్డికి చెందిన భక్తులు హనుమాన్ ఆలయాల్లో బైకు ర్యాలీలతో వెళ్లి వర్షాలు కురిపించాలని వేడుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కల్హేర్‌లోని బద్రప్ప శివాలయంలో శివలింగం, నంది విగ్రహాలకు వరుణ జలాధివాసంతో పూజలు నిర్వహించిన దృశ్యం

ఆకులు, పూలతో ఎకో ఫ్రెండ్లీ రాఖీ


చిన్నకోడూర్ గ్రామపంచాయతీ సిబ్బందికి ఎకో రాఖీలు కడుతున్న మహిళా సిబ్బంది


కోహెడలో స్టీల్‌బ్యాంకు ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎకో రాఖీ కడుతున్న డీపీవో దేవకీదేవి

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 17: జిల్లాలో పర్యావరణ హితమైన రాఖీలను తయారీకి మహిళలు శ్రీకారం చుట్టారు. సహజంగా ప్రకృతిలో దొరికే మామిడాకులు, రావి ఆకులు, పువ్వులతో రాఖీలు తయారు చేస్తున్నారు. గ్రామపంచాయతీ సిబ్బందికి, పాఠశాల్లో విద్యార్థులకు, అంగన్‌వాడీ సెంటర్లలో చిన్నారులకు ఆకులు, పువ్వులతో తయారుచేసిన రాఖీలను కడుతున్నారు. గతేడాది ఎకో ఫ్రెండ్లీ రాఖీల తయారీపై మహిళలకు శిక్షణ ఇచ్చారు. ఇటీవల స్వాతంత్ర్య వేడుకల్లో రోడ్డు రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ మనుచౌదరికి ఎకో ఫ్రెండ్లీ రాఖీలనే మహిళా ఉద్యోగులు కట్టారు. స్వచ్ఛతకు మారుపేరు ప్రకృతిలో దొరికిన పువ్వులు, ఆకులే సోదరీ, సోదరుల మధ్య ప్రేమానురాగాలకు చిహ్నం అని, పేద, ధనికుల మధ్య భేదం లేకుండా ప్రకృతి నుంచి సృష్టించినవే ఎకో రాఖీలని చెబుతున్నారు. ప్లాస్టిక్‌తో తయారయ్యే వస్తువులు పర్యావరణానికి, ప్రజలకు హాని కలిగిస్తున్నాయని జిల్లా పంచాయతీరాజ్‌శాఖ అధికారి దేవకీదేవి మహిళలను చైతన్యం చేస్తున్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఎకో ఫ్రెండ్లీ రాఖీలపైన కార్యక్రమాలు నిర్వహించి, అవగాహన కల్పిస్తున్నారు.

ఎకో ఫ్రెండ్లీ స్వచ్ఛ రాఖీల తయారీ

చేర్యాల, ఆగస్టు 17: పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాఖీపౌర్ణమి పురస్కరించుకుని ప్లాస్టిక్, ఇతరత్రా వాటివి కాకుండా ఆకులు, పూలతో తయారు చేసిన రాఖీలను కట్టాలని ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు చేర్యాల మండల ఇన్‌చార్జి ఎంపీడీవో మహబూబ్‌అలీ తెలిపారు. చేర్యాల మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో అంగన్‌వాడీ, జీపీ సిబ్బందితో స్వచ్ఛరాఖీలు తయారు చేయించామని, ఈ విషయాన్ని ప్రజలకు వివరించి రాఖీ పండుగ రోజు స్వచ్ఛ రాఖీలు కట్టించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు.


ఆకులు, పూలతో తయారుచేసిన రాఖీలు

మా తమ్ముళ్లకు ఎకో రాఖీలే కడతాను

స్వచ్ఛతకు మారుపేరు ప్రకృతిలో దొరికిన పువ్వులు. ఆకులతోనే సోదరులకు మహిళలు రాఖీలు కట్టాలి. గ్రామాల్లో సిబ్బందితో మహిళలకు అవగాహన కల్పించి ఎకో ఫ్రెండ్లీ రాఖీలు తయారుచేయిస్తున్నాం. రక్షాబంధన్ రోజు మా తమ్ముళ్లకు ఎకో రాఖీలే కడతాను. మా కూతురు కూడా ఎకో రాఖీలే కడుతుంది. మనం పర్యావరణానికి హాని కలుగకుండా చూడాలి.

- దేవకీదేవి, జిల్లా పంచాయతీరాజ్‌శాఖ అధికారి

లబ్ధిదారుల నివేదికను అందించాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులకు మంత్రుల ఆదేశం


వీడియో కాన్ఫరెన్స్‌లో మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అధికారులు

సంగారెడ్డి టౌన్/మెదక్ అర్బన్/సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 17: రాష్ట్రంలో ఇప్పటివరకు ఆమోదించిన ఆర్‌వోఎఫ్‌ఆర్ దరఖాస్తుల పట్టాలు లబ్ధిదారులకు చేరాయో.. లేదో నివేదిక అందించాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయం నుంచి రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్కతో కలిసి పోడుభూములపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అర్హులకు పోడు పట్టాలు అందించేందుకు పటిష్ట కార్యాచరణ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి, మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్, సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి, మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణ కట్టుదిట్టంగా నిర్వహించాలి

సంగారెడ్డి టౌన్/మెదక్ అర్బన్, ఆగస్టు 17: 1 జనవరి 2025ను ప్రామాణికంగా తీసుకొని ఓటరు జాబితా సవరణ కట్టుదిట్టంగా నిర్వహించి, 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ ఓటరు జాబితాలో చోటు కల్పించేలా కార్యాచరణ సిద్ధం చేయాలని రాష్ట్ర ముఖ్యఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ సీఈవో కార్యాలయం నుంచి అదనపు సీఈవో లోకేష్‌కుమార్‌తో కలిసి ఓటరు జాబితాపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి, అదనపు కలెక్టర్ మాధురి, మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ట్రిపుల్ రోడ్డు భూసేకరణ త్వరగా పూర్తి చేయాలి: కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 17: రిజనల్ రింగ్ రోడ్ భూసేకరణ త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ మను చౌదరి ఆదేశించారు. రెవెన్యూ అధికారులతో కలెక్టర్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లన్నసాగర్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీవాసుల నష్టపరిహారం విషయంపై చర్చించారు. భూములు ఇచ్చిన ప్రతీ ఒక్కరికి న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆర్డీవోలకు సూచించారు. గజ్వేల్ పట్టణంలోని నిర్మించిన రెండు పడకల ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే అందించాలన్నారు. ఈ వారంలో ఆర్డీవో నేతృత్వంలో ప్రస్తుతం ఇళ్లల్లో నివసిస్తున్న వారితో సమావేశం నిర్వహించి చర్చలు జరపాలని సూచించారు. జిల్లాలో ట్రిపుల్‌ఆర్ రోడ్డు కోసం భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, భూమి విలువను లెక్కకట్టడం కోసం కమిటీని వేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆ కమిటీలో అదనపు కలెక్టర్, ఆర్డీవో, జాయింట్ రిజిస్టర్, అర్బన్‌లో మున్సిపల్ కమిషనర్, రూరల్‌లో జిల్లా పంచాయతీ అధికారి సభ్యులని తెలిపారు. ఈ సమీక్షలో సిద్దిపేట, గజ్వేల్ ఆర్డీవోలు సదానందం, బన్సీలాల్, తహసీల్దార్ పాల్గొన్నారు.

ఇద్దరు పిల్లలతో సహా చెరువులో దూకి తల్లి ఆత్మహత్య

- కుటుంబ కలహాలే కారణం
- తల్లి, కూతురు మృతదేహాలు లభ్యం
- కుమారుడి మృతదేహం కోసం పోలీసుల గాలింపు


ఆత్మహత్యకు పాల్పడిన తల్లి మర్కంటి భానుప్రియ, కూతురు దీక్ష, కొడుకు వేదాన్ష్ ఆనంద్(ఫైల్)

మూడుచింతపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు పిల్లలతో సహా తల్లి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషాద ఘటన మేడ్చల్ జిల్లా శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా ములుగు మండల కేంద్రానికి చెందిన మర్కంటి భానుప్రియ(28) 15న రాత్రి భర్త స్వామితో గొడవపడి కుమారుడు దేవాన్ష్‌ఆనంద్(5), కూతురు దీక్ష(4)లతో కలిసి బయటకువెళ్లింది. రాత్రి వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో స్వామి మరుసటిరోజు ములుగు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా శనివారం సాయంత్రం ఓ మహిళ, ఇద్దరు పిల్లలతో కలిసి శామీర్‌పేట పెద్దచెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. గమనించిన స్థానికులు మహిళ, చిన్నారి మృతదేహాలను వెలికితీసి పోలీసులకు సమాచారమందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు వారి మృతదేహాలను పరిశీలించి ములుగుకు చెందిన మర్కంటి భానుప్రియ, చిన్నారి దీక్షగా గుర్తించారు. కుమారుడు దేవాన్ష్ ఆనంద్ మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

- చిన్నకోడూరు మండలం ఇబ్రహీంపూర్‌లో ఘటన


రజినీకాంత్(ఫైల్)

చిన్నకోడూరు, ఆగస్టు 17: చెట్టుకు ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్ గ్రామానికి చెందిన పంతం లలిత, భూమయ్య దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. చిన్నకుమారుడు రజినీకాంత్(30) కిరాణాషాపు నిర్వహిస్తుండేవాడు. సుమారు నాలుగేళ్ల క్రితం రజినీకాంత్‌కు ఇదే గ్రామానికి చెందిన ఓ యువతితో వివాహం జరిపించాలని పెద్దల సమక్షంలో నిర్ణయమైంది. అయితే ఆ యువతి వేరే గ్రామానికి చెందిన వ్యక్తిని ప్రేమ వివాహం చేసుకున్నది. కొద్దిరోజుల క్రితం ఆమె భర్త రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అప్పటి నుంచి యువతి తల్లిగారి గ్రామమైన ఇబ్రహీంనగర్‌లో ఉంటుంది. ఈ క్రమంలో ఆ యువతి, రజినీకాంత్ ఫోన్‌లో మాట్లాడుకుంటున్నారు. రజినీకాంత్‌కు కుటుంబసభ్యులు ఎన్ని పెళ్లి సంబంధాలు చూసినా నిరాకరిస్తున్నాడు. కాగా శుక్రవారం ఉదయం కిరాణాషాపునకు వెళ్లి వస్తానని తల్లితో చెప్పి రజినీకాంత్ బయటకు వెళ్లాడు. అయితే రజినీకాంత్ చనిపోతున్నానని, వాట్సాప్‌లో తనకు మెసేజ్ పెట్టాడని యువతి.. అదేరోజు మధ్యాహ్నం అతడి కుటుంబసభ్యులకు చెప్పింది. వారు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం ఉదయం రజినీకాంత్ సోదరుడు శేఖర్ బావి వద్దకు వెళ్లి చూడగా.. ఓ చెట్టుకు తాడుతో ఉరేసుకుని మృతిచెంది కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి భూమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.

ప్రేమించిన అమ్మాయి పెళ్లికి ఒత్తిడి.. యువకుడి ఆత్మహత్య


భానుప్రసాద్(ఫైల్)

నిజాంపేట, ఆగస్టు 17: పెళ్లయిన అబ్బాయిని గతంలో ప్రేమించిన అమ్మాయి పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేసింది. దీంతో మనస్తాపానికి గురైన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మెదక్ జిల్లా నిజాంపేట మండల కేంద్రంలో చోటు చేసుకున్నది. మండల కేంద్రానికి చెందిన కొమ్మాట భానుప్రసాద్(26) గతంలో ఇదే గ్రామానికి చెందిన అమ్మాయిని ప్రేమించాడు. వరుసలు కలవకపోవడంతో పెళ్లికి నిరాకరించిన తల్లిదండ్రులు మిరుదొడ్డి గ్రామానికి చెందిన రమ్యతో గతేడాది క్రితం వివాహం జరిపించారు. ఇప్పుడు ప్రేమించిన అమ్మాయి తనను కూడా పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేసి వేధిస్తుండడంతో మనస్తాపానికి గురైన భానుప్రసాద్.. బయటకు వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. కుమారుడు ఎంతకీ తిరిగిరాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికారు. శుక్రవారం రాత్రి తన వ్యవసాయ పొలం వద్ద ఉన్న చింత చెట్టుకు ఉరేసుకుని భానుప్రసాద్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి కొమ్మాట శ్యామల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

వైఎస్సార్‌ను థర్డ్ బటన్ నొక్కి పైకి పంపించా..

- అవినీతిని అడ్డుకోడానికి మళ్లీ బటన్ నొక్కుతా
- ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్


సంగారెడ్డిలో విలేకరులతో మాట్లాడుతున్న కేఏ పాల్

సంగారెడ్డి, ఆగస్టు17 (ఆంధ్రజ్యోతి): వైఎస్సార్‌ను థర్డ్ బటన్ నొక్కి పైకి పంపించా.. అవినీతిని అడ్డుకునేందుకు మళ్లీ బటన్ నొక్కుతానని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ అన్నారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో ఉన్న తమ చారిటీ సొసైటీ భూములను అన్యాక్రాంతం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. తాను ప్రసంగాల ద్వారా సేకరించిన డబ్బులతో 1,200 ఎకరాలతో సొసైటీ ఏర్పాటు చేశామని తెలిపారు. ఇందులో సుమారు 50 ఎకరాల పైచిలుకు డబుల్ రిజిస్ట్రేషన్లతో కబ్జాచేశారని ఆరోపించారు. ఈ విషయంపై ఎస్పీ రూపేష్‌కు ఫిర్యాదు చేసినా చర్యలు చేపట్టడం లేదని అన్నారు. అందుకే సంగారెడ్డి కలెక్టర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసేందుకు వచ్చానని కేఏ పాల్ స్పష్టం చేశారు. ఇప్పటికైనా అవినీతిని అరికట్టాలని సూచించారు. గతంలో థర్డ్ బటన్ నొక్కి రాజశేఖర్‌రెడ్డితోపాటు ఇంకొందరిని పైకి పంపించానని... ఇప్పుడు మరోసారి బటన్ నొక్కాల్సిన అవసరం వచ్చిందని చెప్పుకొచ్చారు. రేవంత్‌రెడ్డిని తమ్ముడిగా సంబోధించారు. రేవంత్‌రెడ్డి సీఎం అయిన వెంటనే తనను కలిశారని.. తన సహాయాన్ని అర్థించారని గుర్తుచేశారు. ఇప్పుడేమో తాను మెసేజ్‌లు చేసినా స్పందించడం లేదని, మాట తప్పారని దుయ్యబట్టారు. అమెరికా పర్యటనకు వెళ్లి ఖాళీ చేతులతో తిరిగొచ్చారని ఎద్దేవా చేశారు. తనను నమ్ముకుంటే ఇప్పటికిప్పుడే 100 కంపెనీలతో ఒప్పందం చేయిస్తానని వెల్లడించారు.

హుస్నాబాద్‌లో బంద్ విజయవంతం



హుస్నాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న హిందు సంఘాలు, బీజేపీ నాయకులు

హుస్నాబాద్, ఆగస్టు 17: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ శనివారం హిందు సంఘాల ఐక్య వేదిక ఇచ్చిన హుస్నాబాద్ బంద్ పిలుపు విజయవంతమైంది. వ్యాపార, వాణిజ్య, హోటళ్లు, ప్రైవేట్ విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్‌ను పాటించాయి. హిందు సంఘాల నాయకులు, బీజేపీ నాయకులు ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న దాడులను ఇక్కడి కాంగ్రెస్, వామపక్షాలు ఎందుకు ఖండించడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, హిందు సంఘాల ఐక్య వేదిక కన్వీనర్ గౌరిశెట్టి ప్రకాశ్, చందుపట్ల నాగరాజు, నాయకులు దొడ్డి శ్రీనివాస్, చిట్టి గోపాల్‌రెడ్డి, చిట్టి దేవేందర్ రెడ్డి, బత్తుల శంకర్‌బాబు, కర్ణకంటి నరేష్, వీరాచారి, కాయిత భాస్కర్‌రెడ్డి, సంపత్‌నాయక్, తగరం లక్ష్మన్, వెల్దండి సంతోష్ తదితరులున్నారు.

మద్దూరులో

మద్దూరు, ఆగస్టు 17: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా శనివారం మండలంలో బంద్ పాటించారు. ఈ సందర్భంగా దాడులను వెంటనే అరికట్టాలని వ్యాపార వాణిజ్యవార్గాలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. కార్యక్రమంలో యువకులు, వ్యాపార వాణిజ్యవార్గాల నిర్వాహకులు పాల్గొన్నారు.

దూళిమిట్ట తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన మధుసూదన్



దూళిమిట్ట, ఆగస్టు 17: దూళిమిట్ట మండల తహసీల్దార్‌గా ఎస్.మధుసూదన్ శనివారం తహసీల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఏర్రోళ్ళ శ్యామ్ సిద్దిపేట కలెక్టరేట్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో ఎస్.మధుసూదన్ సిరిసిల్ల ఆర్డీవో కార్యాలయం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

వైద్యుల రక్షణకు పటిష్ఠ చట్టాలను తేవాలి

● డాక్టర్ల డిమాండ్

వైద్యుల రక్షణకు పటిష్ఠ చట్టాలను తీసుకు రావాలని వైద్యులు డిమాండ్ చేశారు. కోల్‌కతాలో డాక్టర్‌పై హత్యాచారానికి నిరసనగా శనివారం జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ ఆస్పత్రులు బంద్ పాటించాయి. వైద్యులు, వైద్య విద్యార్థులు పలు సంఘాల నాయకులు ర్యాలీలు నిర్వహించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్



ములుగు: లక్ష్మక్కపల్లి ఆర్‌వీఎం ఆస్పత్రిలో ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్లు



కొండపాక: ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న ఫార్మసీ విద్యార్థులు



గజ్వేల్: పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది



చేర్యాల: నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు, వైద్యసిబ్బంది



కుకునూరుపల్లి: గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీ, తదితరులు

విద్యాధరిలో శని త్రయోదశి మహోత్సవం

వర్గల్, ఆగస్టు 17: వర్గల్ విద్యాధరి క్షేత్రంలో శని త్రయోదశి మహోత్సవ వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో శనైశ్చరాలయంలో ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. క్షేత్రంలోని విద్యా సరస్వతీ ఆలయంలో చిన్నారులకు అక్షర స్వీకారాలు నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు.

ఆధ్యాత్మిక చింతనను అలవాటు చేసుకోవాలి

ప్రతీ వ్యక్తి ఆధ్యాత్మిక భావం పెంపొందించుకోవాలని, విద్యార్థి దశ నుంచే ఆధ్యాత్మిక చింతన, దైవభక్తిని అలవాటు చేసుకోవాలని నాచగిరి లక్ష్మీనృసింహ్మాస్వామి క్షేత్రం కార్యనిర్వహణాధికారి ఎస్ అన్నపూర్ణ పేర్కొన్నారు. శ్రావణ మాసం సందర్భంగా నాచగిరి క్షేత్రంలో నాచారం జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు వ్యాసరచన, పద్యాలు, భక్తి పాటలు ఆలపించడంపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ మాట్లాడుతూ.. నెలకు ఒక గ్రామంలోని పాఠశాలను ఎంపిక చేసి పోటీలు నిర్వహించి బహుమతులను అందిస్తామన్నారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి దాతలు బహుమతులు, ప్రశంస పత్రాలను అందజేశారు.



నాచగిరిలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు

పూర్ణహుతితో ముగిసిన పవిత్రోత్సవాలు

నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో నాలుగు రోజుల నుంచి జరుగుతున్న స్వామివారి పవిత్రోత్సవాలు శనివారం మహా పూర్ణహుతితో ముగిశాయి. శ్రావణమాసం రెండో శనివారం సందర్భంగా క్షేత్రానికి భక్తులు అధికంగా తరలివచ్చారు. ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి ఆలయంలో నిర్వహించిన సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాల్లో పాల్గొన్నారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్ అన్నపూర్ణ తెలిపారు.



విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసిన ఆలయ అధికారులు, అర్చకులు

భక్తులతో కిటకిటలాడిన శ్రీశేరిపల్లి ఆలయం

చిన్నకోడూరు, ఆగస్టు 17: శ్రావణ శనివారం పురస్కరించుకుని చిన్నకోడూరు గ్రామ శివారులోని శ్రీ శేరిపల్లి వీరాంజనేయస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ నిర్వాహకులు రామచంద్రరావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు రాఘవేంద్రశర్మ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

● మాజీ సర్పంచుల డిమాండ్



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ సర్పంచులు

అక్కన్నపేట, ఆగస్టు 17: గ్రామపంచాయతీల్లో ఐదు సంవత్సరాల పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసి గ్రామాలను అభివృద్ధి చేసిన సర్పంచుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని మాజీ సర్పంచులు డిమాండ్ చేశారు. అక్కన్నపేట మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీడీవో బానోతు జయరాంనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అప్పులు చేసి అనేక అభివృద్ధి పనులు చేశామని పేర్కొన్నారు. బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, బిల్లులు అందక మాజీ సర్పంచులు అందరం తమ భార్య పిల్లలతో ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో మాజీ సర్పంచులు గద్దల రమేష్, కాశబోయిన సంపత్, పీచర సునీత రామన్న, వంగపల్లి సృజన సంపత్, రవీందర్‌నాయక్, సందబోయిన లావణ్యకుమార్, కత్తుల మానస, బొమ్మగాని రాజేశం, అన్నాడి దినేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాకలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

దుబ్బాక, ఆగస్టు 17: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు దాడిచేయడం సిగ్గుచేటని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాజమౌళి, ఆస స్వామి, రామస్వామి, ఆస యాదగిరి, సంజీవరెడ్డి, కృష్ణలు మండిపడ్డారు. దుబ్బాకలో శనివారం సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు క్యాంపు కార్యాలయంపై జరిగిన దాడిని నిరసిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.

మిరుదొడ్డిలో హరీశ్‌రావు దిష్టిబొమ్మ దహనం

మిరుదొడ్డి, ఆగస్టు 17: ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తానని చెప్పిన హరీశ్‌రావు వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ మిరుదొడ్డి మండల అధ్యక్షుడు మద్దెల రాజేశం అన్నారు. మిరుదొడ్డిలో శనివారం సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ రైతుసంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భూపాల్‌గౌడ్, సుదర్శన్, కుమార్ తదితరులున్నారు.

బలవంతంగా డిపాజిట్లు చేయించవద్దు

● సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యుడు బట్టు దయానందరెడ్డి

జగదేవ్‌పూర్, ఆగస్టు 17: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా మూడు విడతలుగా రుణమాఫీ చేసిందని, బ్యాంక్ అధికారులు రైతుల నుంచి బలవంతపు డిపాజిట్లు స్వీకరించడం సమంజసం కాదని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బట్టు దయానందరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. మూడు విడతలుగా రైతులకు రెండు లక్షల వరకు రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేసిందని వివరించారు. జగదేవ్‌పూర్, ప్రజ్ఞాపూర్ ఏపీజీవీబీ బ్యాంకు అధికారులు రైతుల నుంచి మూడు వేల నుంచి పది వేల వరకు బలవంతపు డిపాజిట్లు స్వీకరిస్తుందని ఆరోపించారు. వెంటనే బ్యాంక్ అధికారులు రైతుల నుంచి బలవంతపు డిపాజిట్లు స్వీకరించడం ఆపివేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతుల పక్షాన పోరాటం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. రుణమాఫీకి అర్హులైనప్పటికీ కొంతమందికి రుణమాఫీ వర్తింపచేయలేదని, వెంటనే వారి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు.

జిల్లాలో పలువురు ఏవోల బదిలీ

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 17: జిల్లాలో పలువురు ఏవోలు, ఏఈవోలు బదిలీ అయ్యారు. వీరికి కౌన్సిలింగ్ జూలై చివరన జరగగా.. రైతు రుణమాఫీ, రైతు బీమా రెన్యూవల్ ఉండడంతో ఆలస్యంగా ఉత్తర్వులు వచ్చినట్లు సమాచారం. దీంతో ఆయా మండలాలలో శనివారం వారు బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్లో ఏవో టెక్నికల్‌గా విధులను నిర్వర్తిస్తున్న శివరామకృష్ణ కొండపాక మండలానికి, కలెక్టరేట్లో ఏవో టెక్నికల్ సత్యఅన్వేష్ అక్బర్‌పేట-భూంపల్లి మండలానికి, కలెక్టరేట్లో ఏవో టెక్నికల్ శ్రీనాథ్ సిద్దిపేట అర్బన్ మండలానికి, సిద్దిపేట అర్బన్ మండలంలో విధులు నిర్వర్తిస్తున్న పరశురాంరెడ్డి నారాయణరావుపేట మండలానికి, కోహెడలో విధులు నిర్వర్తిస్తున్న భోగేశ్వరస్వామి చేర్యాల మండలానికి, కొమురవెల్లిలో విధులు నిర్వహిస్తున్న నరేష్ సిద్దిపేట రూరల్ మండలానికి, దౌల్తాబాద్‌లో విధులు నిర్వర్తిస్తున్న గోవిందరాజు కుకునూరుపల్లి మండలానికి, చేర్యాలలో విధులు నిర్వర్తిస్తున్న ఎండీ. అఫ్రోజ్ దూళిమిట్ట మండలానికి, కొండపాకలో విధులు నిర్వర్తిస్తున్న ప్రియదర్శిని ఏవో టెక్నికల్‌గా కలెక్టరేట్‌కు, హైదరాబాద్ నుంచి ప్రద్యుమ్మా గజ్వేల్ టెక్నికల్ ఏవోగా బదిలీయ్యారు. జిల్లాలో 37 మంది ఏఈవోలు వివిధ క్లస్టర్లకు బదిలీ అయ్యారు

రసాయన ఎరువులను అధికంగా వాడకూడదు

● లోడి సాంఘిక సేవా సంస్థ ఫీల్డ్ కోఆర్డినేటర్ కోడం సత్యనారాయణ

అక్కన్నపేట, ఆగస్టు 17: రైతులు రసాయన ఎరువులను అధికంగా వాడడం వల్ల భూసారం దెబ్బతింటుందని లోడి సాంఘిక సేవా సంస్థ ఫీల్డ్ కోఆర్డినేటర్ కోడం సత్యనారాయణ అన్నారు. మండలంలోని కేశ నాయక్‌తండాలో ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎం బాలశౌరి అధ్యక్షతన శనివారం నీటి విలువలు, భూమిలో తేమపై భూసారం కాపాడుకునే పద్ధతులపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కనకం రవీందర్, భూక్య బిచ్చు, తిరుమల, పిల్లి రమేష్, రైతులు పాల్గొన్నారు.

పత్తిపంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు

జగదేవ్‌పూర్, ఆగస్టు 17: మండలం తిగుల్ గ్రామానికి చెందిన రైతు ఎనకపల్లి నవీన్ పత్తిపంటను సాగు చేశాడు. పత్తిపంట ఆకులన్నీ ముడత రావడం, కాతపూత లేకపోవడం వల్ల మండల వ్యవసాయ అధికారులను సంప్రదించారు. ఏవో వసంతరావు నాలుగు రోజుల క్రితం పత్తిపంటను పరిశీలించారు. పత్తి పరిస్థితిని శాస్త్రవేత్తల దృష్టికి తీసుకెళ్లారు. శనివారం తోర్నాల ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తల బృందం విజయ్, పల్లవి ఆ పత్తి పంటను పరిశీలించారు. పత్తి మొక్కలను ల్యాబ్‌కు పంపించి పరీక్షలు చేయించి, ల్యాబ్ పరీక్ష ఫలితం బట్టి రైతుకు న్యాయం చేస్తామని తెలిపారు. ఎరువులను అధిక మోతాదులో వాడకూడదని ఈ సందర్భంగా వారు సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ అనిల్‌కుమార్, ఏవో వసంతరావు, ఏఈవో శరణ్య, సదానంద్ కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

గోబెల్స్ ప్రచారానికే కాంగ్రెస్ ప్రాధాన్యం

● ఎమ్మెల్సీ వంటేరి యాదవరెడ్డి



గజ్వేల్: మాట్లాడుతున్న యాదవరెడ్డి

గజ్వేల్, ఆగస్టు 17: రుణమాఫీపై మాటతప్పి గోబెల్స్ ప్రచారానికే కాంగ్రెస్ ప్రాధాన్యత ఇస్తున్నదని ఎమ్మెల్సీ వంటేరి యాదవరెడ్డి ఆరోపించారు. గజ్వేల్ పట్టణంలోని ఆయన నివాసంలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. ఉద్యమ నాయకుడు హరీశ్‌రావుకు రాజీనామాలు కొత్త కాదని, హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంపై దాడి చేయడం పాశవిక చర్య అన్నారు. రాష్ట్ర ప్రజలకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలుపరచడంలో కాంగ్రెస్ విఫలమైందని, రుణమాఫీపై ప్రశ్నిస్తే దాడులకు పాల్పడుతుందని ఆరోపించారు. ఆయనవెంట గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, వైస్ చైర్మన్ జకీమయొద్దీన్, మాజీ జడ్పీటీసీ పంగ మల్లేశం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెండే మధు, కౌన్సిలర్ గోపాల్‌రెడ్డి తదితరులున్నారు.

క్యాంపు కార్యాలయంపై దాడులను నిరసిస్తూ ధర్నా

హుస్నాబాద్ టౌన్, ఆగస్టు 17: సిద్దిపేటలో మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ నాయకుల దాడులను నిరసిస్తూ శనివారం హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దాడులతో భయపెట్టి హరీశ్‌రావును ప్రజలకు దూరం చేయలేరని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ. అన్వర్, బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధులు అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, సుద్దాల చంద్రయ్య, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్ తదితరులున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మిరుదొడ్డి/మర్కుక్,ఆగస్టు 17: అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి నర్సింహ్మాచారికి శనివారం వైద్యఖర్చుల నిమిత్తం రూ. 60వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంటకయ్య అందజేశారు. మర్కుక్ మండలంలోని నరసన్నపేటకు చెందిన రాజమైన కల్యాణికి రూ. 60000 సీఎంఆర్ఎఫ్ చెక్కును తాజా మాజీ ఎంపీపీ పాండుగౌడ్, మాజీ జడ్పీటీసీ మంగమ్మ రామచంద్రం, తదితరులు అందజేశారు.

నిత్యావసర సరుకుల అందజేత

మిరుదొడ్డి,ఆగస్టు17: మండల కేంద్రమైన మిరుదొడ్డి గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు బలిజే రమేష్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న సీనియర్ జర్నలిస్టు నర్సింహులు, పుష్ప దంపతులు శనివారం బాధిత కుటుంబానికి నిత్యవసర సరుకులను అందజేశారు. మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామానికి చెందిన హనీఫ్ రోడ్డుప్రమాదంలో కాలును కోల్పోయాడు. గ్రామమాజీ సర్పంచు కిష్టయ్య బాధిత కుటుంబాన్ని పరామర్శించి, 50కిలోల బియ్యాన్ని అందజేశారు.

మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన బండారు శ్రీకాంత్‌రావు



మంత్రి శ్రీధర్‌బాబును సన్మానిస్తున్న శ్రీకాంత్‌రావు

గజ్వేల్, ఆగస్టు 17: అమెరికా పర్యటన పూర్తి చేసుకుని సెక్రటేరియట్‌కు వచ్చిన రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు మర్యాదపూర్వకంగా కలసి స్వాగతం పలికారు. శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబుల కృషితో తెలంగాణకు భారీగా పెట్టుబడులు వచ్చాయన్నారు. త్వరలోనే పెట్టుబడుల ఫలితాలు తెలంగాణకు దక్కడంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయన్నారు.

వీధికుక్కల బారి నుంచి ప్రజలను రక్షించండి

● సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్

హుస్నాబాద్, ఆగస్టు 17: హుస్నాబాద్ పట్టణంలో వీధికుక్కల బెడద ఎక్కువైందని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్ తెలిపారు. హుస్నాబాద్ పట్టణంలో కుక్కల దాడిలో గాయపడిన పలువురు వ్యక్తులను శనివారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. కుక్కల బారి నుంచి ప్రజలను రక్షించాలని పలుమార్లు అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయంపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ తనకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తుండడంతో బాధితుల సంఖ్య రోజురోజుకు పెరిగి పోతున్నదన్నారు.కార్యక్రమంలో సీపీఐ నాయకులు సంజీవరెడ్డి, ఎల్లయ్య ఉన్నారు.

పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్ష ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

హుస్నాబాద్, ఆగస్టు 17: పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్ష ఎన్నికలకు హుస్నాబాద్ పట్టణంలోని మార్కండేయ ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు పద్మశాలి సేవా సంఘం మండల అధ్యక్షుడు బూర్ల రాజయ్య, గోలి వెంకటనారాయణ, రాష్ట్ర నాయకుడు గాజుల భగవాన్‌లు తెలిపారు. ఈ ఎన్నికలు ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతాయని చెప్పారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో 436 మంది ఓటర్లుండగా కోహెడ మండలంలో 123, అక్కన్నపేట మండలంలో 146, హుస్నాబాద్ మండలంలో 167 రిజిస్టర్ చేసుకున్న పద్మశాలి కులస్థులు పోలింగ్ కేంద్రానికి హాజరై ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

కాంగ్రెస్ ఎస్సీ మహిళా సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా గంగాజమున



నియామక పత్రాన్ని అందజేస్తున్న ప్రీతం

మిరుదొడ్డి, ఆగస్టు 17: మండలంలోని అందె గ్రామానికి చెందిన గంగాజమునను రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ మహిళా సెల్ కన్వీనర్‌గా నియమిస్తూ శనివారం నియామకపత్రాన్ని ఆసంఘం రాష్ట్ర అధ్యక్షుడు నగరిప్రీతం హైద్రాబాద్‌లో అంజేశారు.

విద్యార్థులకు గొడుగుల పంపిణీ

కుకునూరుపల్లి, ఆగస్టు 17: మండల కేంద్రంలో జిల్లా ఉన్నత పరిషత్ పాఠశాలలో శనివారం భగవాన్ శ్రీసత్యసాయి సేవాసమితి హైదరాబాద్ ఆధ్వర్యంలో 100 విద్యార్థులకు గొడుగులు పంపిణీ చేశారు. అనంతరం మొక్కలు పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు పోటీలు సహకరిస్తాయి

● మండల నోడల్ అధికారి వదరరాజు



బహుమతులు ప్రదానం చేస్తున్న ఉపాధ్యాయులు

మద్దూరు, ఆగస్టు 17: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలను నిర్వహించడంపై మండల నోడల్ అధికారి, రేబర్తి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వరదరాజు హర్షం వ్యక్తం చేశారు. మద్దూరు మండలంలోని రేబర్తి ఉన్నత పాఠశాలలో వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వరదరాజు మాట్లాడారు. విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధిని సాధించడానికి ఇలాంటి పోటీలు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రభాను, శిరిష, సంపత్, శ్రీనివాస్‌రెడ్డి, రఫత్, రఘుపతిరెడ్డి, చంద్రయ్య, అంజయ్య, లక్ష్మి, నర్సయ్య, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 12 మందికి జరిమానా

సిద్దిపేట క్రైం, ఆగస్టు 17: సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ సిబ్బందితో కొన్ని రోజులుగా పట్టణంలో వివిధ చోట నిర్వహించిన వాహనాల తనిఖీలో 12 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని శనివారం సిద్దిపేట కోర్టులో హాజరుపరచగా విచారణ చేసి 12 మందికి రూ.22,000 జరిమాన విధించారు.

పోచమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న మాజీ జడ్పీటీసీ సింగం సత్తయ్య

మర్కుక్, ఆగస్టు 17: మండలంలోని ఖాశిరెడ్డిపల్లి గ్రామంలో పోచమ్మ ఆలయ నిర్మాణానికి మాజీ జడ్పీటీసీ సింగం సత్తయ్య శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ దేవతల ఆలయాలు పునఃనిర్మాణానికి ఎప్పుడు ముందు ఉంటానని, గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో స్థానిక తాజా మాజీ సర్పంచ్ అప్పాల స్వరూప మల్లేశం, మాజీ సర్పంచ్ వైకుంఠం గ్రామ పెద్దలు ఉన్నారు.

పోగొట్టుకున్న ఫోన్‌ను అందజేసిన పోలీసులు



బాధితుడికి ఫోను అందజేస్తున్న వన్‌టౌన్ పోలీసులు

సిద్దిపేట క్రైం, ఆగస్టు 17: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ టెక్నాలజీతో స్వాధీనం చేసుకుని బాధితుడికి వన్‌టౌన్ పోలీసులు అప్పగించారు. వన్‌టౌన్ ఎస్ఐ కనకయ్యగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట పట్టణానికి చెందిన పవన్ అనే వ్యక్తి సిద్దిపేటలో తన ఫోన్ పోగొట్టుకున్నాడు. అతడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. సీఈఐఆర్ ద్వారా ఆ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని శనివారం పోలీస్ స్టేషన్‌లో బాధితుడికి అందజేశారు.

'పుట్టిన ప్రతి బిడ్డకూ టీకా ఇప్పించాలి'

చేగుంట, ఆగస్టు 17 : చేగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో శనివారం వైద్య సిబ్బంది వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం చేపట్టారు. మండలంలోని కర్నాల్‌పల్లిలో నిర్వహించిన కార్యక్రమానికి వ్యాధి నిరోధక జిల్లా వైద్యురాలు మాధురి(డీఐవో) సందర్శించి వైద్య సిబ్బందిని వివరాలను అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ.. పుట్టిన బిడ్డ మొదలుకొని ఐదేళ్ల వరకు దఫాలవారీగా వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. దీంతో బిడ్డలో వ్యాధి నిరోధక శక్తి పెరిగి బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. వెంట డాక్టర్ అనిల్ కుమార్, సీహెచ్‌వో సంపతి, ఏఎన్ఎం రూపాదేవి, ఆశావర్కర్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

సామాజిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

నాగల్‌గిద్ద, ఆగస్టు 17: మండల పరిధిలోని కరస్‌గుత్తి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం డీసీహెచ్ఎస్ సంగారెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలించడంతోపాటు పరిశుభ్రతను పరిశీలించారు. వెంట వైద్యులు అనురాధ, స్వప్న తదితరులున్నారు.

పాఠశాలల్లో ముందస్తు రక్షాబంధన్

కుకునూర్‌పల్లి, ఆగస్టు 17: తిప్పారం ప్రాథమిక పాఠశాలలో శనివారం రక్షాబంధన్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టి సోదరభావాన్ని చాటారు. కార్యక్ర మంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ రవి, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, మాధురి, ఏఏపీసీ చైర్మన్ రేణుక పాల్గొన్నారు.

● **చేర్యాల:** చేర్యాల పట్టణంలోని పంచతంత్ర పాఠశాలలో శనివారం రక్షాబంధన్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో రాఖీలు కట్టించి రక్షాబంధన్ అనుబంధాన్ని వివరించారు. ఈ వేడుకల్లో పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామల, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మిరుదొడ్డి: భూంపల్లిలో వృక్షానికి రాఖీ కడుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

● **గజ్వేల్:** దేశంలో అమ్మాయిలకు, మహిళలకు రక్షణ కల్పించాలని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి, గజ్వేల్ డివిజన్ నాయకులు నాచారం శేఖర్ డిమాండ్ చేశారు. యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గజ్వేల్ సీఐ బి.సైదాకు రాఖీ కట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వెళ్లాలన్నారు. వారితో యూఎస్ఎఫ్ఐ సభ్యులు అఖిల, కల్యాణి, షరీఫబేగం, రేణుకా, స్రవంతి, సౌందర్య ఉన్నారు.

● **జగదేవ్‌పూర్:** మండల కేంద్రమైన జగదేవ్‌పూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామపంచాయతీ సిబ్బంది, మాజీ ప్రజాప్రతినిధులు కలిసి ముందస్తు రాఖీ సంబరాలు నిర్వహించారు. మహిళలు రాఖీలు కట్టి స్వీట్లు పంచి ఆత్మీయతను పంచారు. కార్యక్రమంలో సిబ్బంది మారెడ్డి, రాజు, కిసాన్, బాలయ్య, మహిళలు పాల్గొన్నారు.

● **నంగునూరు:** తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) నంగునూరు మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని నంగునూరు, నర్మెట్ట అంక్షాపూర్, గట్లమల్యాల, బద్దిపడగ, రాజగోపాల్‌పేట, మగ్దుంపూర్, పాలమాకుల పాఠశాలల్లో రక్షాబంధన్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామస్వామిగౌడ్, తపస్ మండల శాఖ అధ్యక్షుడు జైపాల్‌యాదవ్, ముంద్రాతి రాములు, గడీల శ్రీకాంత్, బీరకాయల తిరుపతి, కత్తుల రామ్‌రెడ్డి, మురళీ, సతీష్, చంద్రకాంత్, రాజేశ్వర్‌రెడ్డి, గోవర్ధన్, మన్మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, యాదవ్‌రెడ్డి, లక్ష్మీనరసయ్య వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. మండలంలోని జేపీ తండాలో అంగన్‌వాడీ టీచర్ కనకలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులకు, తల్లిదండ్రులకు నిర్వహించిన రక్షణ బంధం కార్యక్రమంలో వాటి ప్రాముఖ్యతను వివరించారు.



సిద్దిపేట రూరల్: ఇర్కోడు అంగన్‌వాడీ కేంద్రంలో ఎకో రాఖీలను కడుతున్న టీచర్